



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

కరుణిస్తే కదిరి అభివృద్ధి సాధ్యమే...

గతంలో ఇచ్చిన హామీలకు మోక్షం ఎప్పుడో..?
వెనుకబడిన ప్రాంతానికి ఊతమిస్తారా.....
నేడు కదిరి ప్రాంతంలో ముఖ్యమంత్రి పర్యటన



ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి ప్రాంతం పూర్తిగా వ్యవసాయం ఆధారిత ప్రాంతం. ఈ ప్రాంత ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అభివృద్ధితోపాటు పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న కదిరి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం కదిరి ప్రాంతంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాంత ప్రజల స్థితిగతులను పరిశీలించి కరుణిస్తే కదిరి అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందన్న అభిప్రాయాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కదిరి నియోజకవర్గంలో దాదాపు రెండు లక్షల పైచిలుకు జనాభా కలిగింది. ఈ ప్రాంతంలోని చాలామంది ప్రజలు వ్యవసాయంతో పాటు పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఉన్నత చదువులు చదివిన యువతీ యువకులు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేక వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వదిలి చెన్నై, బెంగళూరు హైదరాబాద్, వంటి నగరాలకు ఉద్యోగ అవకాశాలు వెతుక్కుంటూ వెళ్తున్నారు.

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు : కదిరి నియోజకవర్గం ఏర్పడినుండి దశాబ్దాలకాలంగా వెయ్యి మందికి ఉపాధి కల్పించే ఒక్క పరిశ్రమ ఈ ప్రాంతంలో స్థాపించలేదు. దీంతో ఎంతోమంది యువతి యువకులు, మహిళలు, రైతు కూలీలు బతుకు జీవుడా అంటూ ఉపాధి కోసం బయట ప్రాంతాలకు పరుగులు పెడుతున్న పరిస్థితి ఈ ప్రాంతంలో నెలకొంది. అలాగే ఉన్నత చదువులు చదవడానికి ఇక్కడ సరైన కాలేజీలు లేక విద్యార్థులు విజయవాడ, తిరుపతి, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో లక్షల రూపాయలు ఫీజులు చెల్లించి విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. అదేవిధంగా కదిరి పట్టణం లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సరైన మౌలిక వసతులు లేవు. ప్రధానంగా అండర్ డ్రైనేజీ లేక మురుగునీటి దుర్వాసనతో అనేకమంది రోగాల బారిన పడుతున్నారు. అలాగే పట్టణంలో రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ అవసరం ఉంది.ప్రముఖ పుణ్యక్షేత్రం ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కొలువైన కదిరి నుంచి బెంగళూరు, చెన్నై, ముంబై, వంటి నగరాలకు రాకపోకలు సాగించేందుకు రైల్వే లైన్లు లేవు. గతంలో కదిరి, పుట్టపర్తి, కదిరి చిక్బల్లాపూర్, కదిరి రాయచోటి, తదితర రైల్వే లైన్ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదికలను రైల్వే ఉన్నతాధికారులకు సమర్పించారు. అయితే అప్పట్లో రైల్వే లైన్ల సర్వే కోసం బడ్జెట్లో నిధులు కేటాయించి అనంతరం పక్కన పెట్టేశారు. ఈ ప్రాంత జనాభాను దృష్టిలో ఉంచుకొని రైల్వే లైన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

హామీలు అమలుకు మోక్షం లభిస్తుందా ? : ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ప్రతిపక్ష నేతగా ఎన్నికల ప్రచారంలో భాగంగా కదిరికి వచ్చినప్పుడు పట్టణ ప్రజల సౌకర్యార్యం చెర్లోపల్లి రిజర్వాయర్ నుండి కదిరి పట్టణానికి నీరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కదిరి లక్ష్మీనరసింహస్వామి కోనేరును అభివృద్ధి చేస్తామని తెలిపారు. పాలిటెక్నికల్ కళాశాల నుండి కౌలేపల్లి గేట్ వరకు రింగ్ రోడ్డు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. కదిరిలో అండర్ డ్రైనేజీ , వలసల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పుతామని, కదిరిలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కదిరి నియోజకర్గంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గతంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రకటన విడుదల చేస్తారనికదిరి ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక.. ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం శ్రీ సత్య సాయి జిల్లా కదిరి నియోజకవర్గం తలుపుల మండలం పెద్దన్నవారిపల్లెలో పర్యటించనున్నారు. తొలుత అక్కడ వృద్ధులకు సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తారు.



ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు.

కలెక్టర్ పై మంత్రి ఆగ్రహం : ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్ల విషయంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సిఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించకుండా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించడం ఏమిటని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో పనులు ఎలా జరుగుతున్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ సమీక్ష నిర్వహించకుండా తహశీల్దార్ కార్యాలయంలో అధికారుల సమీక్ష ఏమిటని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

సిఐటియు జిల్లా మహా సభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

నవంబర్ 2, 3 వ తేదీలలో హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న సిఐటియు 10వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెడ్‌పి. శ్రీనివాసులు, ఈఎస్. వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నవంబర్ 2న స్థానిక బీపీఎల్ షోరూం వద్ద బహిరంగసభ ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, కార్మికులందరు పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎ.వి.ఎన్ నాగేశ్వరరావు, సి. హెచ్. నరసింగరావు హాజరవుతున్నారని తెలిపారు. 3వ తేదీన అంబేద్కర్ భవన్ లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. గత మహాసభ నుండి జిల్లా వ్యాప్తంగా కార్మికుల కోసం సీఐటీయూ చేసిన పోరాటాలను ఈ మహాసభలో సమీక్షించుకొని భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేసుకుంటామన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలా విధానాలపై రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపకల్పనకు ఈ మహాసభ వేదిక కాబోతుందన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు జిఎల్ నరసింహులు, నల్ల లక్ష్మీనారాయణ, ప్రవీణ్, హిందూపురం పట్టణ నాయకులు రాము, రామకృష్ణ, మున్సిపల్ యూనియన్ నాయకులు మురళి, నరసింహమూర్తి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

జిల్లాలో భాగా పంటలు పండే భూములను సోలార్ పేరుతో రైతుల దగ్గర నుంచి బలవంతంగా తీసుకోవడం అన్యాయమని ఈ బలవంతపు భూసేకరణ ఆపాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి, పెద్దన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతుసంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పని చేసిన కామినేని రామారావు మృతికి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు హరి, పెద్దన్న మాట్లాడుతూ సూపర్ సిక్స్ అని చెప్పి అధికారం లోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఇంతవరకు నిరుద్యోగ భృతి లేదన్నారు. ప్రతి సంవత్సరం 2 లక్షల ఉద్యోగ అవకాశాలన్నారు అది కూడా లేదని అన్నారు. కార్మికుల చట్టాలను సవరించి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాయలసీమకు ముఖ్యమంత్రి మూడుసార్లు ప్రధానమంత్రి రెండు సార్లు వచ్చారని ఇంతవరకు వారి చేసిందేమీ లేదని విమర్శించారు. మొంథా తుపాను వల్ల మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారిని ఆదుకోవటంలో పాలకులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిఎస్‌టి తగ్గించామని అర్భాట ప్రకటనలు చేస్తున్నారి అయితే రైతులు మందులు, ఎరువులు కొనుగోలు చేస్తే ఇంకా వందరూపాయలు ఎక్కువ తీసుకుంటున్నారని విమర్శించారు. హంద్రీ నీవా జలాలను కుప్పానికి తీసుకుపోవడానికి లైనింగ్ పనులు చేపట్టారన్నారు. ఆ పనుల్లో కూడా నాణ్యత లేదన్నారు. ముదిగుబ్బ మండలంలో నెలకొన్న చుక్కల భూముల విషయంలో గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్నే కూటమి ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు.



సమావేశంలో పాల్గొన్న రైతుసంఘం నాయకులు

మండల కమిటీ ఏర్పాటు: రైతు సంఘం మండల నూతన మండల కమిటీని నాయకులు ఏర్పాటు చేశారు. మండల కార్యదర్శి గా పోతలయ్య, సహాయ కార్యదర్శిగా ఖాదర్ వలిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దన్న, వెంకటేష్, రైతు సంఘం నాయకులు పోతలయ్య, ఖాదర్‌వలి, అవాజ్ నాయకులు బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన చంద్రశేఖర్‌ను ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పాల్గొని మాట్లాడారు. చంద్రశేఖర్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. విధుల పట్ల నిస్వార్థ భావం, క్రమశిక్షణతో ఆయన చేసిన సేవలు ఆదర్శమని కొనియాడారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌ఈ. దస్తగిరి, ఆర్ఒ విజయ భారతి, జెఎఒ మనోహర్, మేనేజర్ సుధాకర్, విశ్రాంత టిఒ. ఆనంద్ రాజ్, ఎంజీఎం హెచ్‌ఎం. రంగనాయకులు, మున్సిపల్ ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ సంస్కృతి

ప్రజాశక్తి-హిందూపురం

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ సంస్కృతి అనివన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో జాతీయ సమైఖ్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారతీయ సంస్కృతి సాంప్రదాయాల దుస్తులు ధరంచి పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ సమైఖ్యతను చాటుతు చేసిప నృత్యాలు ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో సిఐ రాజగోపాల్, పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, కరస్పాండెంట్ నంద కుమార్, హెచ్‌ఎం గాయత్రి, ఎఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్‌ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు పట్టుదల తోడైతే విజయం సొంతం : ఏదైనా సాధించాలన్న పట్టుదల ఉంటే విజయాన్ని సాధించడం తేలిక అవుతుందనివన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు విద్యార్థులకు సూచించారు. మార్చి 16వ తేది నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో శుక్రవారం పాంచజన్య పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు భవిష్యత్తు ప్రణాళిక... రానున్న పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, క్రమశిక్షణ పట్టుదల అని అంశాలపైన పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐ మాట్లాడుతూ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.



కార్యక్రమంలో పాల్గొన్న వన్‌టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు, శ్రీనివాసులు తదితరులు



అంగన్వాడీ భవనంలో ఉపాధ్యాయుల కాలక్షేపం



ఉపాధ్యాయులు లేకపోవటంతో తరగతి బయట విద్యార్థులు

ప్రజాశక్తి విలేకరిపై ఉపాధ్యాయుల దాడి

ఫొటోలు తీయడానికి వెళ్లిన పాత్రికేయుడిపై దౌర్జన్యం
పోలీసులు, ఎంఇఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి -పరిగి

పిల్లలకు క్రమశిక్షణ, గౌరవ మర్యాదలు నేర్పాల్సిన ఉపాధ్యాయులు వాటిని మరచి రౌడీల్లా ప్రవర్తించారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన టీచర్లు విచక్షణ మరిచారు. పాఠశాల సమస్యలపై వార్తల కవరేజీకి వెళ్లిన ప్రజాశక్తి విలేకరిపై కొందరు ఉపాధ్యాయులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఫొటోలు తీస్తున్న విలేకరి చేతిలో సెల్‌ఫోన్ లాక్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చే విధంగా చోటు చేసుకున్న ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని పి. నరసాపురంలో శుక్రవారం జరిగింది. ఈఘటనకు సంబంధించిన వివరాలు...

మండలం పి.నరసాపురంలో 2012 సంవత్సరంలో ఆ గ్రామానికి చెందిన గంగాధరప్పకు చెందిన స్థలంలో ప్రభుత్వం రూ. 15 లక్షలతో పాఠశాల భవనాలను నిర్మించింది. అయితే ఆయన తన భూమిని కొందరు గుత్తేదారులు ఆక్రమించుకొని భవనాలు నిర్మించారని ఈ భూమిని తనకు అప్పజెప్పాలని కోర్టుకు వెళ్లాడు. దీంతోపాటు స్థానికులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు సైతం నమోదు చేయించాడు. దీంతో ఆ భవనాలు అలాగే ఉండిపోయాయి. అప్పటినుండి ఇటు ఉపాధ్యాయులు అటు విద్యార్థులు భవనాల కొరతతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవలే ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందుల గురించి కథనం ప్రచురించడానికి ప్రజాశక్తి విలేకరి హరిప్రసాద్ శుక్రవారం పాఠశాల వద్దకు వెళ్లాడు.అయితే ఆ సమయంలో విద్యార్థులను ఎండలో కూర్చోబెట్టి సమీపంలోని అంగన్వాడీ భవనంలో జయరాం నాయక్, మరో ఉపాధ్యాయులు సేదతీరుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన విలేకరి అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు కూర్చొన్న ఫోటోలను తన సెల్‌ఫోన్లో తీశాడు. అది గమనించిన ఉపాధ్యాయులు ఒక్కసారిగా విచక్షణ కోల్పోయారు. అక్కడ పనిచేస్తున్న జడ్.పి. హెచ్.ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు 15 మందికి పైగా ఏకమయ్యారు. సినిమా తరహాలో విలేకరిని రౌండప్ చేశారు. తీసిన ఫోటోలు డిలీట్ చేయాలని హుకుం జారీ చేశారు. ఫోటోలు తీసుకుని ఏం రాస్తారో బ్లాక్‌మెయిల్ నాకొడు....లు అంటూ దుర్భాషలాడారు. పత్రికల్లో రాయలేని భాషను వాడారు. ఉపాధ్యాయులు అవలంభిస్తున్న వ్యవహారాన్ని తన ఫోన్లో విడియో తీసేందుకు ప్రయత్నిస్తున్న విలేకరిపై దాడికి పాల్పడ్డారు. సెల్ ఫోన్, ఐడి కార్డును లాక్కొన్నారు. ఇక్కడి నుంచి బయటకు ఎలా వెళ్తావో చూస్తామంటూ వీధి రౌడీల తరహాలో సవాల్ చేశారు. తాము నేర్చుకున్న విద్యను, సంస్కారాన్ని మరిచి వ్యవహరించిన ఉపాధ్యాయుల తీరును మండల విలేకరుల సంఘం ఖండించింది. విలేకరిపై దౌర్జన్యానికి పాల్పడిన ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈఘటనపై విలేకరులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, ఘటనాస్థలం వద్ద ఉన్న సిసి ఫుటేజీలను సేకరించి వాస్తవాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అంతేకాకుండా మండల విలేకరులు మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీదేవిని కలిసి సమస్యను వివరించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. అయితే ఎంఇఒ ఈ విషయంపై చేసిన వ్యాఖ్యలు విమర్శలకు దారితీశాయి. 'పాఠశాలలకు మీరు ఎలా వెళతారు.. ఏదైనా అవసరం ఉంటే తనకు సమాచారం ఇవ్వా'లి అని వ్యాఖ్యానించారు. ఎంఇఒ ఇలా వ్యాఖ్యానించడాన్ని బట్టి చూస్తే ఘటనపై ఎలాంటి సమాచారం లేకుండా ఉపాధ్యాయులను వెనుకేసుకుని మాట్లాడినట్లు ఉందని, ఇక ఈ ఘటనలో ఏం న్యాయం జరుగుతుందని అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కల్తీ కల్లు విక్రయాలపై సమగ్ర విచారణ జరిపించాలి

ఎక్సైజ్ అధికారుల వ్యాఖ్యలు శోచనీయం
ప్రజా సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రాంతంలో కల్తీకల్లు జరగలేదని, కల్లు సేవించిన వ్యక్తులు అలా వ్యవహరించడం సర్వ సాధారణమని ఎక్సైజ్ ఉన్నతాధికారులు పేర్కొనడం సిగ్గుచేటని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు విమర్శించారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు శుక్రవారం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేసి కల్తీకల్లు విక్రయాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కల్తీ కల్లు విక్రయాలపై చర్యలు తీసుకొని విక్రేతలను కఠినంగా శిక్షించాలని రాజకీయ పార్టీలు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిఐకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఆ తర్వాత ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ గోవింద నాయక్, సీఐ లక్ష్మీ దుర్గయ్యలు కల్లు కల్తీ జరగలేదని చెప్పడం సిగ్గుచేటుగా ఉందన్నారు. రెండు రోజులపాటు కల్లు తాగిన పేదలు విచిత్రమైన వింతగా ప్రవర్తిస్తుంటే బాధితుల పక్షాన ఉండాల్సిన అధికారులు ఇలా చెప్పడం శోచనీయమన్నారు. కల్తీ లేకపోతే హిందూపురం సమీపంలోని పులమతి రోడ్డు లోపక్కన సర్వే నంబర్ 463 –6 గల తోటలో కల్లు తయారీ కేంద్రం ఉండడం వాస్తవం కాదా, అక్కడ కల్తీగా తయారు చేయడం వాస్తవం కదా అని ప్రశ్నించారు. ఎక్కడో ఈత కల్లును తీసుకొచ్చి శాంపిల్ పంపించి అంతా బాగా ఉందని చెప్పడం ఎవరిని మభ్యపెట్టడానికని నిలదీశారు. బాధ్యత కలిగిన అధికారులు కల్లులో కల్తీ జరగలేదని చెప్పడం తగదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిపి జిల్లా కార్యదర్శి ఎ. శ్రీనివాసులు, ఎంఐఎం పార్టీ కార్యదర్శి మున్నా, ఆంధ్ర ప్రదేశ్ ఎరుకుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు కే.బి శంకరయ్య, ఆల్ ఇండియా బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు హరికుమార్, జై భారత్ భీమ్ రావు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఊటుకూరు నాగరాజ్, ఆర్ వై ఎఫ్ జిల్లా నాయకులు ఊటుకూరు నరసింహమూర్తి, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్, కదిరి అర్బన్, తలుపుల

ఎన్టీఆర్ భరోసా పథకం క్రింద లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు శనివారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు సంబంధించి కట్టుదిద్ధమైన భద్రత ఏర్పాట్లను సమన్వయంగా ప్రణాళిక బద్ధంగా పూర్తి చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జెసి మౌర్య భరద్వాజ్ తో కలిసి తలుపుల మండలం పెద్దన్న గారి పల్లి గ్రామంలో హెలిపాడ్ ప్రజావేదిక సభా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తయారు చేసిన మ్యాపులను పరిశీలించి ప్రజావేదిక, విఐపి, గ్రామస్తులు, మీడియా గ్యాలరీ సిట్టింగ్, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాట్లు, జరుగుతున్న పనులను పరిశీలించి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయడంతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి ప్రజాప్రతినిధులు ప్రజలు వస్తున్న సందర్భంగా ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్ కొరకు అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేయాలని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించి సూచనలు సలహాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, పుట్టపర్తి సువర్ణ, కదిరి శర్మ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామా విజయేంద్ర ప్రసాద్, డిటిఓ సమత, డిఎంహెచ్‌ఒ ఫిరోజ్ బేగం వివిధ జిల్లాల శాఖల అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన : తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లిలో శనివారం నిర్వహించనున్న సిఎం పర్యటన భద్రతా ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో. ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. హెలిప్యాడ్ ప్రదేశం, బోజన వసతి ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రిని ఎవరెవరు కలవాలన్న దానిపై ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ చర్చించినట్లు తెలుస్తోంది. ఎంపిక చేసిన వారిని మాత్రమే ముఖ్యమంత్రితో మాట్లాడించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి
www.prajasakti.com

ట్యాంకర్‌తో అరకొర నీటి సరఫరా..

పట్టణంలో మూడేళ్ల క్రితం చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో తాగునీటి పైపులైన్లు ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో నగర పంచాయతీ అధికారులు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. అయితే రోజువారీ అవసరాలకు సరిపడినంత నీరు అందక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న పైపులైన్ నిర్మాణం చాలా వరకూ పూర్తయింది. అయితే అక్కడక్కడ చిన్న చిన్న పనులు నిలిచిపోవడంతో పట్టణంలో కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని ఎదురుచూసిన ప్రజలకు నిరాశే ఎదురైంది.

ప్రజాశక్తి-పెనుకొండ

రోడ్డు విస్తరణలో పైపులైన్ ధ్వంసం.. సరి చేయని అధికారులు.. మూడేళ్లుగా ప్రజలకు తప్పని తిప్పలు..



పెనుకొండ పట్టణంలోని ఆల్విన్ కాలనీలో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా

పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో గత వైసిపి ప్రభుత్వ పాలనలో మూడేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఆ పనుల్లో స్థానిక రాజేశ్వరికాలనీ నుంచి పట్టణంలోని మడకశిర రహదా రికి ఇరువైపులా ఉన్న వజ్రాల పేట, ఆల్విన్ కాలనీల్లో తాగునీటి సరఫరా పైపులైన్ ధ్వంసమైంది. దాంతో మూడేళ్ల నుంచి 250కి పైగా నివాస గృహాలకు నగర పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీళ్ల సరఫరా చేస్తున్నారు. ట్యాంకు ద్వారా అందించే నీళ్లు చాలడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కొళాయిల ద్వారా రెండు రోజులకు ఓ సారి నీళ్లు వచ్చేవని, ట్యాంకర్ వారానికి ఓ సారి వస్తుండంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులు, పాలకులకు ఫిర్యాదు చేసినా త్వరలో పూర్తి చేయిస్తామని హామీ ఇస్తున్నారే తప్ప సమస్య ను పరిష్కరించ లేదని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. కనీసం కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాతైనా సమస్య తీరుతుందని ప్రజలు ఆశలు పెట్టుకోగా ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు గడిచినా ఇదిగో, అదిగో అంటున్నారే తప్ప పనులు పూర్తి చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి పైపులైన్ పనులను పూర్తి చేసి తాగునీటి సమస్యను పరిష్కరించేలా దృష్టి సారించాల్సి ఉంది.

ఏళ్లు గడుస్తున్నా పూర్తి కానీ పైపులైన్

రోడ్డు విస్తరణలో ధ్వంసమైన పైపులైన్ పునర్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ రాజేశ్వరికాలనీలో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గుత్తేదారు హెచ్‌డిపి పైపులతో రాజేశ్వరి కాలనీ నుంచి పైపుల ఏర్పాటుకు పూనుకున్నారు. పైపులు వేయడానికి జెసిబితో కాలువ తీస్తే రోడ్డు ధ్వంసం అవుతుందని ఆర్అండ్‌బి అధికారులు పనులను అడ్డగించారు. రోడ్డు ధ్వంసమైతే తిరిగి మరమ్మతులు చేయడానికి నగర పంచాయతీ రూ. 3 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలని రోడ్లు భవనాల శాఖ అధికారులు నగర పంచాయతీ అధికారులకు నోటీసులు ఇచ్చారు. దీంతో పైపులైన్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. అనంతరం రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన మొత్తాన్ని మున్సిపల్ శాఖ చెల్లించడంతో పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో కల్వర్టులు ఉండడంతో పైపులు వేయడం ఆపేశారు. దీంతో రాజేశ్వరి కాలనీ నుంచి ఏడిళ్ల కాలనీ, వజ్రాలపేట, ఆల్విన్ కాలనీ, మడకశిర రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాసాలకు సరఫరా అయ్యే తాగునీటి వ్యవస్థ నిలిచిపోయింది. ప్రస్తుతం పైపులైన్ నిర్మాణానికి రూ. 9.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయినా ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడం శోచనీయం.

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

రోడ్డు విస్తరణలో పైపులు ధ్వంసం కావడంతో నీటి సరఫరా అయ్యే ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. పలుమార్లు తాగునీటి సమస్య తీర్చాలని సంబంధిత అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేశారు. దీంతో నీటి ట్యాంకర్లతో ఆయా ప్రాంతాలకు నీరు సరఫరా చేస్తున్నారు. కొళాయిల ద్వారా రెండు రోజులకు ఓ సారి నీటి సరఫరా అయ్యేది. ట్యాంకర్‌తో వారానికి ఓ సారి సరఫరా చేయడంతో నీటి కొరత ఏర్పడి పలువురు ప్రయివేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు.

నిధులొచ్చాయి.. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం


రూ. 9.50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించి పైపులైన్ పనులు పూర్తి చేస్తాం. పనులు పూర్తవగానే కొళాయిల ద్వారా నీరు సరఫరా చేసి సమస్యను పరిష్కరిస్తాం.

- సతీశ్ కుమార్, నగరపంచాయతీ కమిషనర్

తలుపుల మండలంలో మూడో సిఎం పర్యటన

గతంలో పర్యటించిన జలగం, వైఎస్.. నేడు చంద్రబాబు రాక

ప్రజాశక్తి-తలుపుల



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం తలుపుల మండలంలో పర్యటించను న్నారు. దీంతో మండల చరిత్రలో ముగ్గురు ముఖ్యమంత్రులు పర్యటిం చినట్లు రికార్డులకు ఎక్కుతుంది. ఇప్పటి వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా కాంగ్రెస్‌పార్టీ తరఫున ఎన్నికైన జలగం వెంగళరావు, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మండలంలో పర్యటించారు. ప్రస్తుతం కూటమి పార్టీల తరఫున ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబునాయుడు శనివారం మండలానికి రానున్నారు. దీంతో ముగ్గురు ముఖ్య మంత్రులు మండలానికి వచ్చినట్లు అవుతుంది. అప్పట్లో జలగం వెంగళరావు తలుపులలో పర్యటించి బిసి హాస్టల్ పక్కా గృహాలను ప్రారంభించారు. ఆ తర్వాత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీ ముఖ్య మంత్రిగా మండలంలో సందర్శించి పేద ప్రజలకు పలు హామీలు ఇచ్చి అమలు చేశారు. ప్రధానంగా స్థానికుల వినతి మేరకు రోడ్లు, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అలాగే పక్కాగృహాలు నిర్మించి ఇచ్చారు. ఇప్పుడు నారా చంద్రబాబు నాయుడు మండలంలో పర్యటించి లబ్ధిదారులకు ఎన్టీఆర్ సామాజిక భద్రత భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. అయితే ఈ ప్రాంతంలో ఏదైనా పరిశ్రమలు గానీ ఇతరత్రా ఉపాధి అవకాశాల కల్పనకు శ్రీకారం చుడతారా లేదా ఏదైనా హామీలు కురిపిస్తారా అని ఈ ప్రాంత వాసులు ఎదురుచూస్తున్నారు.

పటేల్ జీవితం ఆదర్శప్రాయం

రాష్ట్రీయ ఏక్తా దివస్‌లో ఎస్పీ సతీష్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



పచ్చజెండా ఊపి యూనిటీ ఆఫ్ రన్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

భారతదేశాన్ని ఐక్యతగా చేయడంలో, దేశంలోని వివిధ సంస్థానాలను విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి మరువలేనిదని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. పటేల్ జయంతి పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'యూనిటీ ఆఫ్ రన్' కార్యక్రమం నిర్వహించారు. పెట్రోల్ బంక్ సమీపం లోని రింగ్ రోడ్ వద్ద ఎస్పీ పచ్చజెండా ఊపి రన్‌ను ప్రారంభిం చారు. ఈ రన్ ఎస్పీ కార్యాలయం వరకూ సాగింది. ప్రముఖులు మాట్లాడుతూ ప్రజల్లో ఐక్యత ప్రాముఖ్యతను చాటుతూ, దేశ సమగ్రత కోసం పటేల్ చేసిన త్యాగాలను గుర్తు చేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లా డుతూ పటేల్ జీవితం భారతీయులకు స్ఫూర్తిదా యకం అన్నారు. 40 శాతం స్వతంత్ర రాష్ట్రాలను భారత దేశంలో ఏకం చేయడం ద్వారా దేశ సమగ్రతకు పునాది వేశారన్నారు. ఆయన ధైర్యం, దృఢనిశ్చయం మనందరికీ ఆదర్శమన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా యూనిటీ ఆఫ్ రన్ నిర్వహిస్తూ, ప్రజల్లో ఐక్యతా స్ఫూర్తిని బలోపేతం చేస్తున్నారని తెలిపారు. ఐకమత్యంతో ముందుకు సాగితే ఏదైనా సాధ్యమని, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యంద న్నారు. అనంతరం 'దేశం ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడడానికి కృషి చేస్తాను' అని ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సిఐలు శివాంజనేయులు, సురేష్, ఆర్ఐలు వలి, మహేష్, రవికుమార్, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఆర్ఎస్ఐలు వీరన్న, ప్రసాద్, ఎఆర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి-గుడిబండ

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీ కరణను అడ్డుకుంటామని మడకశిర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎస్ఎల్.ఈరలక్కప్ప తెలి పారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో మండలంలోని మోపురుగుండు గ్రామంలో కోటీ సంతకాల సేకరణ కోసం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఈరలక్కప్ప మాట్లాడుతూ పేదలకు వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో వైసిపి హయాంలో అప్పటి సిఎం జగన్ రూ. 8,480 కోట్ల వ్యయంతో వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. 2023-24లో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను ప్రారంభించి అందులో 750 ఎంబిబిఎస్ సీట్లను తీసుకొచ్చారన్నారు. పాడేరు, పులివెందుల వైద్య కళాశాలలు పూర్తయితే 50 సీట్ల చొప్పున ఇస్తామని జాతీయ వైద్య మండలి చెబితే ప్రస్తుత సిఎం చంద్రబాబు ఇవ్వొద్దని లేఖ రాసి విద్యార్థులకు అన్యాయం చేశారని ఆరోపించారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం మిగిలిన 10 వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేట్‌పరం చేయాలని చూస్తుందని, తద్వారా పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందన్నారు. కావు ఆ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ పేదల కోసం పని చేయగా చంద్రబాబు కార్పొరేట్ వర్గాలు, బినామీల కోసం పని చేస్తున్నారని ఆరోపించారు. కోటీ సంతకాల సేకరణ ద్వారా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. వైద్య కళాశాలలను యథాతథంగా కొనసాగించేంత వరకూ ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని, కూటమి ప్రభుత్వ మెడలు వంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిపి రాధమ్మ, పంచాయతీ అధ్యక్షుడు నాగేంద్ర, మందలపల్లి సర్పంచి అశ్వత్థ, నాయకులు తిప్పేస్వామి, కెటి.మంజునాథ, ఎఎల్.లింగరాజు, శ్రీరామ్, శివలింగప్ప, లింగన్న, ప్రభాకర్, బంగారు లింగప్ప, రవి, నరేశ్, కరినింగప్ప, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



మానసతో పిడి, ఉపాధ్యాయులు

హైజంప్‌లో మానస ప్రతిభ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

చెన్నేకొత్తపల్లి మండలంలోని వెంకటంపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కంసల మానస డివిజనల్ లెవెల్ హైజంప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. బత్తలపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఎస్‌జిఎఫ్ డివిజనల్ లెవెల్ సెలక్షన్సలో మానస అండర్-17 హైజంప్‌లో ప్రథమ స్థానం, బ్యాట్మింటన్ పోటీల్లో 4వ స్థానం సాధించింది. మానసను ఉన్నత పాఠశాల పిడి లీలరాయల్, అబ్జర్వర్ పిడి శంకర్, సీనియర్ పిడి రమేష్, డివిజనల్ కోఆర్డినేటర్ నాగరాజు, విద్యార్థిని తండ్రి కంసల నారాయణస్వామి అభినందించారు.



ఎమ్మెల్యే, మాజీ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మాణిక్యం బాబా, ముస్లింలు

దర్గా కమిటీ మేనేజర్‌గా మాణిక్యం బాబా

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక హజరత్ మస్తాన్‌వలి సయ్యద్ షా దర్గా కమిటీ మేనేజర్‌గా మాణిక్యం బాబాను నియ మించారు. దీంతో శుక్రవారం ఆయన మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ముస్లింలతో కలిసి దర్గా నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. బాబా మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి వీరి కృషి మరువలేనిది అన్నారు. వారి సలహాలు, సూచనల మేరకు దర్గా అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. బాబాకు వక్ఫ్ బోర్డ్ రాష్ట్ర ఛైర్మన్ అజీజ్, ఆఫియా, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీలు సైకిల్ షాప్ బాబా, ఇమామ్, ఇదయతుల్లా, షామీర్, ముస్లింలు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

స్టాంప్స్, రిజిస్ట్రేషన్ డిఐజి పి.విజయలక్ష్మి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



మాట్లాడుతున్న డిఐజి విజయలక్ష్మి, పక్కన డిఆర్ కృష్ణకుమారి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారు లను నమ్మి మోసపోవద్దని స్టాంప్స్, రిజిస్ట్రేషన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ పి.విజయలక్ష్మి సూచించారు. ఆమె శుక్రవారం పట్టణంలోని రిజిస్టర్ కార్యాల యాన్ని సందర్శించి రికార్డులను పరిశీలిం చారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 21 సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఉండగా అందులో అనంతపురంలో 12, శ్రీసత్యసాయి జిల్లాలో 9 ఉన్నాయన్నారు. కార్యాలయాల వద్ద దళా రుల వల్ల కొనుగోలు, విక్రయదారులు ఇబ్బం దులు పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని ఆమె వద్ద ప్రస్తావించగా ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏదేని భూమి రిజిస్ట్రేషన్ చేసుకునే ముందు ఈసీ కోరితే ఇస్తారని, దానిని పరిశీలించి రిజిస్ట్రేషన్ చేసుకుంటే సమస్యలు ఉండవన్నారు. జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ వరకూ తమ టార్గెట్ రూ. 139.26 లక్షలు కాగా రూ. 129.56 లక్షల ఆదాయం వచ్చింద న్నారు. ఎవరూ దళారులను ఆశ్రయించకుండా నేరుగా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జిల్లా కార్యాలయంలో దళారులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా కార్యకలాపాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.



రొద్దం ఎస్ఐగా వీరాంజనేయులు

ప్రజాశక్తి-రొద్దం

మండల నూతన ఎస్ఐగా వీరాంజనే యులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది శు భాకాంక్షలు తెలిపారు. ఈయన రొళ్ల మండల ఎస్ఐగా పని చేస్తూ సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న నాగేంద్ర కర్నూలు జిల్లాలోని ముచ్చుమర్రి మండలానికి వెళ్లారు. కొద్దిరోజులుగా ఇక్కడ ఇన్‌ఛార్జి ఎస్ఐగా పని చేస్తున్న వీరాంజనేయులు శుక్రవారం పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపట్టారు.

ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యశాల నియోజకవర్గానికి వరం

ప్రజాశక్తి-మడకశిర టౌన్



విలేకరులతో మాట్లాడుతున్న రాజశేఖర్, రఘురారెడ్డి

నియోజకవర్గ ప్రజలకు ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యశాల(డాక్టర్ శాంతమ్మ జయరాం కంటి వైద్య కేంద్రం) ఓ వరం అని ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్య ఆసుపత్రి అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ శాంతమ్మ జయరామ్ కంటి వైద్య కేంద్రంలో శుక్రవారం ఆమయన సిడబ్ల్యుసి సభ్యులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 25వ ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రిని నవంబర్ 3వ తేదీ నీలకంఠాపురం గ్రామంలో ప్రారంభిస్తున్నా మన్నారు. తెల్ల రేషన్‌కార్డుదారులకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. లేని వారు ఫీజులు చెల్లించాలన్నారు. ఆసుపత్రికి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు రెండెకరాల భూమితో పాటు అత్యాధునిక పరికరాల కొనుగోలుకు నిధులు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, నరసింహమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రవిశంకర్, ఈశ్వరప్ప, గోవిందరాజులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్టర్ కార్యాలయం మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-గోరంట్ల



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోరంట్ల పట్టణంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ శు క్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు టిడిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్ శుక్రవారం గోరంట్లకు రాగా స్థానిక కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అలాగే పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నాయకుల వినతిపై మంత్రి స్పందిస్తూ గోరంట్లలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, హస్తకళల రాష్ట్ర డైరెక్టర్ సోమశేఖర్, నాయకులు విద్యాధరణి, నిమ్మల శ్రీధర్, వెంకటరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు జయచంద్ర, రవి, మోహన్, గోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగేనాయక్, చింతా రామచంద్రారెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సోమందేపల్లి : రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల వైద్యులు ఓంకార్ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు రామ్మోహన్‌రెడ్డి సుమారు 900 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, 20 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు, 23 మందికి కళ్లజోడు కోసం సిఫార్సు చేశారు. శిబిరంలో ఆరోగ్య పర్యవేక్షకులు రవీంద్ర, సిబ్బంది జరింతాజ్, రాజశేఖర్, చంద్రశేఖర్, నాగరత్న, అశ్వర్థమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌పై ఫిర్యాదు

ఓబుళదేవరచెరువు : అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్‌సిపి పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా, ఏపీ రైతు సంఘం నాయకులు రామచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు శు క్రవారం వారు ఎంపిడిఒ శివ ప్రసాద్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బియ్యం గోడౌన్ ఎదురుగా ఏర్పాటు చేసిన గంగా ఈశ్వర్ వాటర్ ప్లాంట్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించ కుండా నీటిని బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడు తున్న ఆ వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయాలని కోరారు.

రైతులకు యూరియా పంపిణీ

గోరంట్ల : పట్టణంలోని సహకార సంఘం కార్యాలయం వద్ద శుక్రవారం సంఘం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి రైతులకు యూరియా పంపి ణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బస్తా రూ. 280 ధరతో ఒక రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేస్తు న్నామన్నారు. అవసరమైన రైతులు యూరియా తీసుకెళ్లి పంటలకు వేసుకోవాలన్నారు. కార్యక్రమం లో విద్యాధరణి, హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, సింగిల్‌విండో అధ్యక్షులు జయచంద్ర, రవి, మోహన్, డైరెక్టర్లు గంగాధర్, నబీరసూల్, సొసైటీ సెక్రటరీ జగన్మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న గోపాల్‌రెడ్డి

గాలిమరల వాహనం బోల్తా

ప్రజాశక్తి-చిలమత్తూరు



క్రేన్ సాయంతో గాలిమర రెక్కను ఎత్తుత్తున్న హైవే అధికారులు

జాతీయ రహదారి-44పై మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న స్పైసీ డాబా వద్ద శు క్రవారం గాలిమరల రెక్క తీసుకెళ్తున్న లారీ బోల్తా పడింది. ఆ సమయంలో వాహనం వెనుక నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. ప్రత్యేక క్రేన్ల సాయంతో సుమారు 3 గంటల పాటు శ్రమించి గాలిమరల రెక్కను తిరిగి వాహనంపై ఉంచారు.

ఇందిరాగాంధీకి నివాళి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం తుంపర్తి పరమేష్ ఆధ్వర్యంలో భారత తొలి మహిళా ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆ పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ఇందిరాగాంధీ చెరిగిపోని ముద్ర వేశారన్నారు. ముఖ్యంగా పేదరిక నిర్మూలన, అంటరానితనం, నిరుపేదలకు ఇళ్లు, భూ పంపిణీ, తదితర ఎన్నో శాశ్వతమైన పనులు చేశారన్నారు. ఆమె సేవలకు సార్థకంగా పట్టణంలో కాంస్య విగ్రహం ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరామన్నారు. కార్యక్రమం లో ఎన్ఎస్‌యుఐ నాయకులు సురేష్, నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్, రాజు, మధు, కేశగాళ్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పట్టణాభివృద్ధికి సహకరించాలి

మడకశిర టౌన్ : పట్టణ అభివృద్ధికి కౌన్సిలర్లు సహకరించాలని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ నరసింహరాజా కోరారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధికి సహకరించాలని, ప్రజలకు అందుబా టులో ఉండి అవసరమైన సదుపాయాలు కల్పించా లని సూచించారు. కమిషనర్ పగడాల జగన్నాథ్ మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీ కాలువల నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం సమావేశంలో అజెండా చదివి వినిపించగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు, మేనేజర్ చంద్రమౌళి, ఏఈ మురళీధర్, టిపిఒ సునీల్‌రాజ్, ఆర్ఐ మజీద్, మెప్మా సీఈవో నాగేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటాలి

నంబులపూలకుంట : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఎంఇఒ గోపాల్‌నాయక్, హెచ్ఎం మోహన్ రెడ్డి సూచించారు. చెకుముకి పోటీల విజేత విద్యార్థిని వైష్ణవిని శుక్రవారం వారు స్థానిక జడ్పీ హైస్కూల్‌లో అభినందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బిరెడ్డి, పూర్ణానందరెడ్డి, వెంకట్‌రెడ్డి, శివయ్య, రమణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు హరీష్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకల వాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్, పిఇటి ఖాదర్‌వలి తెలి పారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల అభినం దన సభ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ కదిరి ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యం లో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చాటారన్నా రు. షటిల్ పోటీల్లో నరసింహమూర్తి, మనోజ్‌కు మార్, హృతిక, వాలీబాల్‌లో నరేంద్రయాదవ్, ఖోఖో లో మనోజ్, మోక్షిత్, 400 మీటర్ల రిలేలో ప్రీతమ్ సింగ్, 400 మీటర్ల పరుగు పందెంలో నరేంద్ర యాదవ్, షాట్‌పుట్‌లో మోక్షిత్ నాయక్ ఎంపికైనట్లు తెలిపారు. వీరు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్టీ, ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో అండర్- 14, 17 బాల బాలికల పోటీలు నిర్వహిం చగా 7 మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటాచలం, వివిధ మండలాల పిఈటిలు, పీడీలను సన్మానించారు. కార్యక్రమంలో డివిజనల్ కోఆర్డినేటర్ లస్కర్ నాయక్, శంకర్ నాయక్, హరిప్రసాద్, రవీంద్రనాయక్, యశోద, ప్రసాద్, సుజాత, బాబజాన్, సందీప్, కెటి.ప్రసాద్, విజయ్ కుమార్ నాయక్, బాబాఫక్రుద్దీన్, సంధ్య, పద్మ, రెడ్డప్ప, షబ్బీర్, మహేశ్వరి, సాయి, రమణ, ఆనంద్‌రెడ్డి, హారున్, పాపారాయుడు, నాగశేషు, మునియప్ప, ఎం.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని కురుమామిడి పంచాయతీ పాయకట్టు గ్రామంలో శుక్రవారం జిల్లా మలేరియా అధికారి ఓబులేసు, వైద్యాధికారి మహేశ్వరిమారుతి ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ఇళ్లు, పరిసరాల ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, తదితర వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నుంచి రక్షణ కోసం దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది డి.రామాంజులు, బాషా, వైద్య సిబ్బంది నాగేష్, విజయ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో 'రెయిన్‌బో' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఇటీవల మండల స్థాయిలో జరిగిన ఖోఖో, కబడ్డీ పోటీల్లో స్థానిక రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి డివిజన్ లెవెల్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం జయసింహా రెడ్డి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్నారన్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. డివిజన్ లెవెల్‌కు ఎంపికైన విద్యార్థులు.. బాలికలు అండర్-17 ఖోఖో విభాగంలో వై.జాహ్నవి, జి.మైత్రి, బి.ఉషారాణి, ఎస్.లేఖ్యశ్రీ, ఎస్.వర్ష, 100 మీటర్ల రన్నింగ్‌లో వై.జాహ్నవి, జావెలిన్ త్రోలో ఆర్.గోపిక, లాంగ్ జంప్‌లో ఆర్.గోపిక, షార్ట్ పుట్‌లో వై.తన్మహి, బాలుర ఖోఖో విభాగంలో ఎ.గౌతమ్‌రాయల్, ఎస్.మనోజ్‌కుమార్‌రెడ్డి, వై.ధీరజ్‌కుమార్‌రెడ్డి, ఎం.మోహన్ నాయక్, సి.చేతన్‌రెడ్డి, అండర్-14 కబడ్డీలో పి.శ్రీదేవి, ఖోఖోలో సి.హర్షిత. వీరిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో రాకేష్, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.



డివిజన్ లెవెల్‌కు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం జయసింహా